ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పని చేయాలి

• అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : ఉపాధి హామీ పీడీ సురేశ్

ఉపాధి హామీ ఓపెన్ ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్

మోత్కూరు, సెప్టెంబర్ 5 : ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా వ్యవహరించాలని ఈజీఎస్ పీడీ, అదనపు డీఆర్‌డీఓ సురేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉపాధి హామీ మండల 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయి ఆడిట్ నివేదికను సామాజిక తనిఖీ డీఆర్‌పీలు సమర్పించారు. మండలంలోని 10 గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వరకు రూ.1.77 కోట్ల విలువైన 345 పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అలసత్వం ప్రదర్శించి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినన చర్యలు తప్పవని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. లెక్కింపులో అలసత్వం వహించిన టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.9,944 చొప్పున, విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.1,848 చొప్పున రికవరీకి ఆదేశించారు.

మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి మందాడి ఉపేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మన్ వీరమల్లు, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ ఆదిత్య, ఎంపీడీఓ పి.శంకరయ్య, ఎంపీఓ పి.జనార్దన్‌రెడ్డి, ఎస్‌టీఎం అంజిగౌడ్, ఎస్‌ఆర్పీ రాజు, ఏపీఓ కరుణాకర్, ఏటీలు జాఫర్, యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలి

• ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ యశోద

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ యశోద

చౌటుప్పల్, సెప్టెంబర్ 5 : సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.యశోద అన్నారు. మున్సిపాలిటీలోని లక్కారంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ సర్వే, ఇంటెన్సిఫైడ్ హెచ్ఐవీ స్క్రీనింగ్ క్యాంపెయిన్ సక్రమంగా చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిత్యం ఫీవర్ సర్వే నిర్వహించాలని, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని అన్నారు. సమావేశంలో వైద్యాధికారులు సుమన్‌కళ్యాణ్, సీహెచ్ కాటంరాజు, సంపత్‌కుమార్, వసంత, మధుమోహన్, సత్యనారాయణ, ఇస్తారి, శశికళ, ఝాన్సీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా అదనపు ప్రజా వైద్యాధికారి మనోహర్

వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా అదనపు ప్రజా వైద్యాధికారి మనోహర్

వలిగొండ, సెప్టెంబర్ 5 : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి రోగులకు వైద్య సేవలందించాలని జిల్లా అదనపు ప్రజా వైద్యాధికారి మనోహర్ అన్నారు. మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోరేజ్‌తోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ, వైద్యులు ప్రసిద్ధ, ఉదయ్‌కిరణ్, అనూష, అనూరాధ, రమేశ్, ప్రవీణ్, మరియమ్మ, రేణుక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

• జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ లిటరసీ మనీషా

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ లిటరసీ మనీషా

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 5 : మహిళలు గృహ హింస చట్టాలు, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ లిటరసీ మనీషా అన్నారు. జిల్లా మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎరుకల బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారత బృందం మహిళలకు సంబంధించిన హక్కులపై గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి అందజేసే గుడ్లు, పౌష్టికాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పీఎంఈజీపీ, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలు హెల్ప్‌లైన్ కోసం 181, 1098కు డయల్ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

రైతుల వివరాల నమోదు పరిశీలన

రాజాపేటలో యాప్‌లో రైతుల వివరాల అప్‌లోడ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శాంతినిర్మల

రాజాపేట, సెప్టెంబర్ 5 : మండల కేంద్రంతోపాటు, చల్లూరులో రేషన్‌కార్డు లేక రుణమాఫీ నిలిచిపోయిన రైతుల వివరాల నమోదును ఏడీఏ శాంతినిర్మల గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని రైతుల కుటుంబాల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు లేక రుణమాఫీ జాబితాలో ఉన్న ప్రతిఒక్కరూ వ్యవసాయ అధికారులకు తమ కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అపర్ణ, ఏఈఓ ప్రణీత, అంజయ్య, వినీత పాల్గొన్నారు.

మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా శోభారాణి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 5 : మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్.శోభారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తాసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీరాజ్ ఇంజినీర్, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు, వరదలు వచ్చిన సందర్భంలో మండల స్థాయి విపత్తుల నిర్వహణ టీమ్ సభ్యులందరూ శాఖల వారీగా చేయవలసిన కార్యక్రమాలు, ముందస్తు ఏర్పాట్ల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలను పరిశీలించాలన్నారు.

యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవ

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్బార్ సేవోత్సవం వైభవంగా జరిగింది. గురువారం ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారి స్వస్తి మంత్రార్థ వంటి మంత్రాలతో శాంతింపజేశారు. నక్షత్రహారతి ఇచ్చి స్వామివారిని కొలిచారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణ మూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతు నిర్వహించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.14,10,624 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సతీసమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయ స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద ఆశీర్వాద మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

• సర్వేపల్లి చిత్రపటాలకు నివాళి
• ఉపాధ్యాయులకు సన్మానం

బొమ్మలరామారం : కేజీబీవీలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

భువనగిరి అర్బన్/ భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 5 : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భువనగిరి పట్టణంలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఇంటర్ విద్యాధికారి సి.రమణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. మండలంలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జీఎంఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులకు రూ.30వేల చెక్కు అందజేశారు.

ఆలేరు రూరల్ : మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

రాజాపేట : మండల కేంద్రంలో విశ్రాంత ఎంఈఓ బల్ల దామోదర్‌ను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, పడాల ముత్యాలు మెమోరియల్ హైస్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, పడాల ముత్యాలు మెమోరియల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనివాస్, విజయ్ సన్మానించారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఉన్నత పాఠశాలల్లో వాకిటి రాంరెడ్డి చేయూత ఫౌండేషన్, కంది శశిధర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించి మెమొంటోలు అందజేశారు.

చౌటుప్పల్ : పట్టణంలోని బాలికల గురుకుల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు.

రామన్నపేట : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వెల్లంకి ఉన్నత పాఠశాలలో పద్మశ్రీ పురస్కార గ్రహీత కూరెళ్ల విఠలాచార్య ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు.

భువనగిరి అర్బన్ : సాధన పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

తుర్కపల్లి : జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ భాగ్యలక్ష్మి తదితరులు

వలిగొండ : వేంకటేశ్వర జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌ను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

చౌటుప్పల్ : గురుకుల పాఠశాలలో..

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి : సీపీఎం

భువనగిరి అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 5 : బునాదిగాని కాల్వ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో అడ్డగూడూరు నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీబీనగర్ మండలం మక్తాఅనంతారం నుంచి అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు 98.64 కిలోమీటర్లు కాల్వ తీయాల్సి ఉండగా, 34 కిలోమీటర్లు మాత్రమే కాల్వ పనులు జరిగాయన్నారు. కాల్వ పరిధిలో 259 కల్వర్టులు, బ్రిడ్జీలు అవసరం ఉంటే 33 మాత్రమే నిర్మించారని తెలిపారు. ఏండ్లు గడుస్తున్నా రూ.33కోట్ల పని మాత్రమే జరిగిందన్నారు. కాల్వ పూర్తి చేసేందుకు రూ.250 కోట్ల ప్రతిపాదనను మరిచి నామమాత్రపు నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా నాయకులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, మాయ కృష్ణ, వెంకటేశ్, ముత్యాలు, రాజు, రాంబాబు పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వను పూర్తి చేయాలి

మోత్కూరు : బునాదిగాని కాల్వ పనులను పునరుద్ధరించి గోదావరి జలాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం కోరారు. మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సాగు, తాగునీటి కోసం జరుగుతున్న పోరాటంలో పార్టీలకతీతంగా రైతులు పాల్గొని మద్దతు తెలుపాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి వెంకటనర్సు, నాయకులు రాములమ్మ, యాదిరెడ్డి పాల్గొన్నారు.

డెంగ్యూ రోగులకు పరీక్షలు చేయాలని ధర్నా

ఆలేరు సీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 5 : డెంగ్యూ రోగులకు టెస్టులు చేయాలని ఆలేరు సీహెచ్‌సీ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌల్ మాట్లాడుతూ సీహెచ్‌సీలో డెంగ్యూ టెస్టులు చేయకుండా పేషెంట్లను బయటికి పంపడం వల్ల సామాన్య ప్రజలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డెంగ్యూతోపాటు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం అందించాలని, మందులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, రమేశ్, ఆదామ్, అనిల్, కమలమ్మ పాల్గొన్నారు.

డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ దిలీప్ అక్రమ అరెస్టు హేయం

మోత్కూరు, సెప్టెంబర్ 5 : డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులను సోషల్ మీడియాలో ఎత్తిచూపుతున్న దిలీప్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి టార్గెట్ చేసి పోలీసులతో అరెస్టు చేయించారన్నారు. దిలీప్‌ను బేషరతుగా విడుదల చేసి అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌గా నర్సింహారెడ్డి

బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహారెడ్డి

చౌటుప్పల్, సెప్టెంబర్ 5 : మున్సిపల్ కమిషనర్‌గా కోమటిరెడ్డి నర్సింహారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆయన బదిలీపై భూదాన్ పోచంపల్లికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహించిన కొంతకాలం తర్వాత సిక్ లీవ్ తీసుకున్నారు. సెలవులు ముగిసిన ఆనంతరం చౌటుప్పల్‌కు తిరిగి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎన్.వెంకటేశ్వర్‌నాయక్ భూదాన్ పోచంపల్లికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన నర్సింహారెడ్డిని పలువురు సన్మానించారు.

చోరీకి పాల్పడిన ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

చౌటుప్పల్, సెప్టెంబర్ 5 : మండలంలో బైక్ చోరీకి పాల్పడిన ఇద్దరికి చౌటుప్పల్ న్యాయస్థానం గురువారం 6నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించిందని సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఆత్మకూర్(ఎం) మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బద్దుల అనిల్, మోత్కూరు మండలం సదర్శాపురం గ్రామానికి చెందిన బత్తిని స్వాతి 6నెలల క్రితం బైక్ చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష, 100 రూపాయల జరిమానా విధించిందని సీఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో మూడేండ్ల జైలు..

చౌటుప్పల్, సెప్టెంబర్ 5 : వరకట్న వేధింపుల కేసులో స్థానిక కోర్టు ఓ వ్యక్తికి 3సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జారిమానా విధించిందని సీఐ మన్మథకుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పరిధిలోని లక్ష్మీగూడకు చెందిన ఆటో డ్రైవర్ కాశమోని శివకుమార్‌పై అతని భార్య ఫిర్యాదు మేరకు 2016లో వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. ఈ క్రమంలో నిందితుడికి శిక్ష పడింది. దీంతో అతడిని నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

రైతుల సంక్షేమం కోసమే రూ.2లక్షల రుణమాఫీ

• భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, సెప్టెంబర్ 5 : రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం 117 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులు, షాదీ ముబారక్ కింద ఒకరికి, 38మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపడుచులకు వరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణ విముక్తి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం కాల్వలను పూర్తి చేసి మండలంలోని ప్రతి రైతుకూ సాగునీరందిస్తామన్నారు, రుణమాఫీపై అపోహలొద్దని, అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ జరిగి తీరుతుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి జగన్నాథం, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, నాయకులు వాకిటి అనంతరెడ్డి, పాశం సత్తిరెడ్డి, గూడూరు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలి

• జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

పల్లెపహాడ్‌లో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

తుర్కపల్లి, సెప్టెంబర్ 5 : తల్లి తన బిడ్డకు పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. పోషణ మాసం పురస్కరించుకొని మండలంలోని పల్లెపహాడ్, మాదాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, తల్లులకు గురువారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బిడ్డకూ 2గంటలకు ఒకసారి ఆహారం అందించడంతోపాటు తక్కువ బరువు ఉన్న పిల్లలను సప్లిమెంటరీ సూపర్‌వైజర్ ఫీడింగ్‌లో నమోదు చేయించి మెడికల్ ఆఫీసర్‌కు చూయించాలని అన్నారు. బిడ్డకు 6నెలల వరకు కచ్చితంగా తల్లిపాలు తాగించాలని, 6నెలలు నిండిన వెంటనే అనుబంధ ఆహారంతోపాటు తల్లి పాలను కొనసాగించాలని సూచించారు. బిడ్డకు ఆహారం అందించేటప్పుడు పరిశుభ్రత పాటించడం వల్ల ఎన్నో వ్యాధులను నిర్మూలించవచ్చన్నారు. అనంతరం తుర్కపల్లి, మాదాపురం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. సరుకుల గడువు తేదీలను చూసుకోవాలని, తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేసేలా చూడాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని, మెడికల్ ఆఫీసర్లు శృతిని, రాహుల్‌కుమార్, సీడీపీఓ స్వరాజ్యం, సూపర్‌వైజర్ నజీమున్నీసా పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలి

అడ్డగూడూరు : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోత్స్న

మోత్కూరు, సెప్టెంబర్ 5 : గ్రామాల్లో ఈ నెల 30 వరకు నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని సీడీపీఓ జ్యోత్స్న అన్నారు. మున్సిపాలిటీలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి గురువారం పోషణ వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లల తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం గురించి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాసంపై అవగాహన

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆశ వర్కర్లకు, ఏఎన్ఎంలకు గురువారం సీడీపీఓ జ్యోత్స్న పోషణ మాసంపై అవగాహన కల్పించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు పోషణ మాసంలో చేసే కార్యక్రమాల గురించ వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇండ్లల్లో ఉండొద్దు : మున్సిపల్ కమిషనర్

శిథిలావస్థకు చేరిన ఇండ్లకు హెచ్చరిక బోర్డులు రాయించిన అధికారులు

మోత్కూరు, సెప్టెంబర్ 5 : వానకాలం సీజన్‌లో శిథిలావస్థలో ఉన్న పాత ఇండ్లల్లో నివాసం ఉండవద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇండ్లను సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని, దాంతో గోడలు, పైకప్పు తడిసి కూలిపోయే అవకాశం ఉందని అన్నారు. ఈ క్రమంలో పాత ఇండ్లల్లో ఉండవద్దని, ప్రత్యామ్నాయంగా వేరే ఇండ్లను చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వీరస్వామి, శ్రవణ్‌కుమార్, నర్సింహాచారి, రాంబాబు, నాగరాజు, శ్రీను, మోహన్‌రావు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి : తాసీల్దార్

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్‌రెడ్డి

బీబీనగర్, సెప్టెంబర్ 5 : గణేశ్ ఉత్సవాలను నిబంధనలు పాటిస్తూ శాంతియుతంగా నిర్వహించుకోవాలని తాసీల్దార్ ఎం.శ్రీధర్, సీఐ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గణేశ్ ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు కోసం పోలీసులు రూపొందించిన ఆన్‌లైన్‌లో లింక్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సభ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడవద్దన్నారు. విగ్రహాలను మండపాలకు చేర్చేటప్పుడు, నిమజ్జనం కార్యక్రమాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ఎన్.రమేశ్, విద్యుత్ ఏఈ మనోహర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాస్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

13న గోదావరి జలాల సాధన సదస్సును జయప్రదం చేయండి


సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 5 : మూసీని ప్రక్షాళన చేసి గోదావరి, కృష్ణా జలాలు అందించాలని కోరుతూ ఈ నెల 13న పట్టణంలోని జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని మూసీ ప్రక్షాళన, గోదావరి, కృష్ణా జలాల సాధన వేదిక జిల్లా కో కన్వీనర్ కొండమడుగు నర్సింహ కోరారు. పట్టణంలో గురువారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మూసీ కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మూసీ నీటిని ప్రక్షాళన చేయడంతోపాటు గోదావరి, కృష్ణా జలాలను అందించడమే మార్గమని, వీటి సాధన కోసమే సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూసీ జల కాలుష్యాన్ని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సదస్సులో పాల్గొనాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వేదిక జిల్లా కో కన్వీనర్ కోట రామచంద్రారెడ్డి, నాయకులు విష్ణు, గోవర్ధన్, జగన్, జంగయ్య, మల్లయ్య, సిద్ధార్థ, చంద్రప్రకాశ్ పాల్గొన్నారు .